తీర్థ యాత్రలకు ఆర్టీసీ ప్రత్యేక టూర్

భగత్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రల ప్రత్యేక టూర్ ప్యాకేజీలో బాగంగా కరీంనగర్-1 డిపో నుంచి యాత్ర స్థలాలకు బస్సును నడిపిస్తున్నట్లు డిపోమేనేజర్ విజయ మాధురి ఒకప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ ఆదివారం ఉదయం 3.30 నిమి షాలకు కరీంనగర్ బస్టాండ్ నుంచి ఏడుపాయల, స్వర్ణగిరి, యాదగిరిగుట్ట దర్శనాల అనంతరం అదే రోజు రాత్రి కరీంనగర్ చేరుకుం టుందన్నారు. పెద్దలకు 1,150, పిల్లలకు 880 రూపాయలు టికెట్‌గా నిర్ణ యించామని తెలిపారు. వివరాలకు 7382849352, 9959225920, 8074690491 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

- మానకొండూర్ పిహెచ్‌సీ వైద్య సిబ్బంది పనితీరు భేష్
- 36 గంటల్లో 5 సాధారణ ప్రసవాలు
- డీఎంహెచ్‌వో వెంకటరమణ



మానకొండూర్ పీహెచ్‌సీలో బాలింతలను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

మానకొండూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించి పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ సిబ్బందికి సూచించారు. మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 36 గంటల్లో ఐదు సాధారణ ప్రసవాలు చేసిన పీహెచ్‌సీ సిబ్బంది పని తీరు బాగుందని ప్రశంసించారు. బాలింతలను పిహెచ్‌సీలోని సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యుడు ఎండీ సల్మాన్‌తోపాటు సిబ్బంది, బాలింతలను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎంహెచ్‌వో వెంకటరమణ మాట్లాడుతూ మానకొండూర్ పీహెచ్‌సీలో 36 గంటల్లో ఐదు సాధారణ ప్రసవాలు చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జనవరి నుంచి 222 సాధారణ ప్రసవాలు జరిగినట్లు ఆయన తెలిపారు. మహిళలు గర్భం దాల్చిన నుంచి ప్రసవమయ్యే వరకు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో రాజగోపాల్, ప్రత్యేకాధికారి సనా, పీహెచ్‌సీ వైద్యులు ఎండీ సల్మాన్, రాజ్‌నాయక్ పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులకు ప్రాధాన్యం
• ఆన్‌లైన్‌లోనే విద్యుత్ బిల్లుల చెల్లింపులు
6

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి



నగరంలో అస్తవ్యస్తంగా ట్రాఫిక్

- రోజుకో రోడ్డు ప్రమాదం

కరీంనగర్ కోర్టు చౌరస్తా.. ఎటు చూసినా విపరీతమైన రద్దీ.. మూడు వైపులా బస్సుల కోసం ఎదురు చూసే ప్రయాణికులు.. అదే ప్రాంతంలో అస్తవ్యస్తంగా నిలిపిన వాహనాలు.. ఆస్పత్రులన్నీ ఈ జంక్షన్‌కు సమపంలోనే ఉండడంతో జగిత్యాల, మంచిర్యాల వైపు నుంచి వచ్చే వారు ఇదే ప్రాంతంలోనే బస్సులు దిగుతుంటారు.. ఓ వైపు విపరీతమైన వేగంతో వెళ్లే వాహనాలు.. మరో వైపు ప్రయాణికుల కోసం ఎగబడే ఆటోవాలాలు.. పేరుకే జంక్షన్ అయినా ఇష్టారాజ్యంగా దూసుకెళ్లే వాహనదారులు.. అంతకంటే వేగంగా వెళ్లే ట్రాక్టర్లు, టిప్పర్లు.. ఇలా అస్తవ్యస్తంగా ఉంటుంది. బుధవారం ఆవుల రవి అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు బైక్‌పై తన భార్యతో కలిసి కోర్టు చౌరస్తా నుంచి మంచిర్యాల చౌరస్తా వైపు వెళుతున్నాడు. ఇంతలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఓ కారు హఠాత్తుగా రోడ్డుపైకి వచ్చి రవి బైక్‌ను ఢీకొంది. దీంతో అతడు రోడ్డుపై పడిపోయాడు. వెనకనే వేగంగా వచ్చిన ఓ ట్యాంకర్ అతడిని తొక్కుకుంటూ వెళ్లింది. బైక్‌పై ఉన్న ఆయన భార్య పక్కకు పడడంతో తీవ్రంగా గాయపడింది. నిమిషాల వ్యవధిలో జరిగిన ఈ ఘటనతో అక్కడ ఉన్న వారు భయాందోళనలకు గురయ్యారు.. కోర్టు చౌరస్తాలోనే కాదు.. నగరవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది.

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో అమాయకులు ప్రాణాలను కోల్పోతున్నారు. తమ మార్గాన తాము వెళుతున్న సమయంలో అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారితో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. బుధవారం నగరంలోని కోర్టు చౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆవుల రవి అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు దుర్మరణం చెందిన ఘటనఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

- అతి వేగంగాట్యాంకర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లు

నగరంలో లారీలు, ట్యాంకర్‌లు, ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు అతివేగంగా నడుపుతుండడంతో రోజుకో చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు, పాదచారులు తీవ్రగాయాలపాలవుతూనే ఉన్నారు. ఇటీవల కేబుల్ బ్రిడ్జి చౌరస్తా వద్ద ఒక కారు రోడ్డుదాటుతున్న వ్యక్తిని ఢీకొట్టగా అతని రెండు చేతులు విరిగాయి, పక్కటెముకలు, కాలుకు గాయాలయ్యాయి. చిన్నచిన్న ఉద్యోగాలు చేసు కుంటూ జీవి తాన్ని గడుపు తున్న ఆ కుటుంబం తీవ్రమైన ఆర్థిక సమస్యలకు గురైంది. ఇలాంటి రోడ్డు ప్రమాదాలు కరీంనగర్ సిటీతో పాటు శివారులోని బైపాస్ రోడ్‌లో నిత్యం జరుగుతూనే ఉన్నాయి.



కరీంనగర్‌లో వాహనాల రద్దీ (ఫైల్)

- ట్రాఫిక్‌ను నియంత్రణపై నిర్లక్ష్యం

నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను, ట్రాఫిక్ నిబంధనలు సరిగా అమలు కావటంలేదనే విమర్శలు వస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు చలాన్లు, డ్రంకెన్‌డ్రైవ్‌లపై పెడుతున్న శ్రద్ధను అతివేగంగా నడిపే వాహనదారులు,



కరీంనగర్ కోర్ట్ వద్ద వెళుతున్న వాహనాలు (ఫైల్)

ర్యాష్ డ్రైవింగ్ చేసే యువకులపై చూపడం లేదని నగర వాసులు అంటున్నారు. చలాన్లు విధించడం,


(మిగతా 8వ పేజీలో)

- రాత్రివేళలో బైక్‌లతో విన్యాసాలు రేస్‌లు

నగరంలో కొందరు యువకులు ట్రాఫిక్ మధ్య నుంచే విపరీతమైన శబ్దం చేసుకుంటూ బైక్‌లతో విన్యాసాలు చేస్తున్నారు. అటువంటి వారిని పట్టుకునే వారే లేకుండా పోయారు. నగర శివారులోని మానేరు బైపాస్‌రోడ్, బొమ్మకల్ బైపాస్‌రోడ్, పెద్దపల్లి బైపాస్ రోడ్, యల్లాపూర్, చింతకుంట బైపాస్‌రోడ్‌లలో నిత్యం రాత్రి వేళల్లో బైక్ రేసులు నడుస్తున్నాయి. మానేరు బైపాస్‌రోడ్, చింతకుంట-మల్కాపూర్ బైపాస్‌రోడ్‌లలో బైక్ రేసుల కారణంగా పలువురు యువకులు మృత్యువాతపడిన సంఘటనలు ఉన్నాయి.

వి'పత్తి'

- ఒకవైపు భారీ వర్షాలు... మరో వైపు కూలీల కొరత
- అధిక వర్షాలతో తగ్గిన పత్తి దిగుబడి



హుజూరాబాద్ మండలం కాట్రపల్లిలో సాగు చేసిన పత్తి

హుజూరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు ఈ ఏడాది వరుస కష్టాలు ఎదురయ్యాయి. యూరియా కొరత, అధిక వర్షాలు వంటి ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్న రైతులు, ప్రస్తుతం కూలీల కొరతతో ఇబ్బంది పడుతున్నారు. ఏరడానికి కూలీలు దొరకకపోవడంతో పగి లిన పత్తి చేనులోనే రాలుతోంది. కొందరు రైతులు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొస్తుండగా, వారు కూలి అధికంగా పెంచేశారు. పత్తిని మార్కెట్‌కు తీసుకెళ్లితే తేమ శాతం, నాణ్యత సరిగ్గా లేదని ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధర చెల్లిస్తున్నారు. పత్తిని అమ్మితే ఏరిన కూలీలకైన డబ్బులుకూడారావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- సీజన్ ప్రారంభం నుంచి కష్టాలే..

డివిజన్‌లో హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండలాలు ఉన్నాయి. 1.20లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. అందులో 80వేల ఎకరాల్లో వరి, 25వేల ఎకరాల్లో పత్తి, 15వేల ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేస్తారు. వానాకాలం ప్రారంభంలో ఒకటి రెండు వర్షాలు కురవడంతో రైతులు పత్తి విత్తనాలు వేశారు. తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో అవి మొలకెత్తలేదు. మళ్లీ రైతులు విత్తనాలు పెట్టారు. పత్తి పూత దశలో రెండు నెలల పాటు వరుసగా వర్షాలు కురి శాయి. దీంతో పత్తి గూడ రాలిపోవడంతో పాటు, కాయలు నల్లబారిపోయాయి. తీరా పత్తి ఏరుకునే సమ యంలో మొంథా తుపానుతో భారీ వర్షం కురిసింది. ఏర డానికి సిద్ధంగా ఉన్న పత్తి నానిపోయి రంగు మారింది. ప్రస్తుతం ఉన్న పత్తిని ఏరుదామంటే కూలీల కొరత ఏర్పడింది. ఏరిన పత్తిని మార్కెట్‌కు తీసుకెళితే తేమ ఉందని సీసీఐ అధికారులు కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు 8,110, రెండో రకానికి 7,710 రూపాయలు ప్రకటించింది. 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. వర్షాలు ఆగిపోయిన వెంటనే మంచు కురవడంతో ప్రస్తుతం తేమ శాతం తక్కువ రావడం లేదు. దీంతో సీసీఐ అధికారులు పత్తిని తిరస్కరిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారుల వద్దకు రైతులు వెళితే క్వింటాల్‌కు ఐదు వేల నుంచి 5,500 వరకు చెల్లిస్తున్నారు. కూలీలు, పెట్టుబడులు, రవాణా ఖర్చులు పోతే రైతులకు క్వింటాల్‌కు 500 నుంచి వెయ్యి రూపాయలు మిగిలే అవకాశం ఉంది. గత సంవ త్సరం వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఎకరానికి 10 నుంచి 15క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ప్రస్తుతం వర్షాలకు దెబ్బతిన్న పత్తితో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 4.5 కోట్ల రూపాయల కుభంకోణం జరిగినట్లు విమర్శలు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ రెండు విచారణ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ రెండు బృందాలు గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విచారణ నిర్వహించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సూర్యశ్రీరావు, అసిస్టెంట్ ఫైనాన్స్ అధికారి యాదగిరి బృందం తెలంగాణ వైద్య విధాన పరిషత్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ ఎం అనితగ్రేస్, డాక్టర్ ఎన్ కృష్ణమోహన్‌తోపాటు అసిస్టెంట్ ఫైనాన్స్ ఆఫీసర్ వై శ్రీనివాస్‌తో కూడిన బృందం ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. సంబంధిత అధికారులను పిలిపించి ప్రశ్నించారు. ఈ విషయమై తెలంగాణ వైద్య విధాన పరిషత్ స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సూర్యశ్రీరావును వివరణ కోరగా కమిషనర్ ఆదేశాల మేరకు విచారణ కోసం వచ్చామని తెలిపారు. గతంలోనే రెండు సార్లు విచారణ కమిటీలను ఏర్పాటు చేసి నివేదికను సమర్పించినట్లు తెలిపారు. అందులో కొన్ని లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించి వాటిని సరిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. ఆడిట్‌లో కూడా కొన్ని విషయాలను గుర్తించి వాటిని సరిచేయాలని సూచించినట్లు చెప్పారు. వాటిని సరిచేశారా లేదా అనే విషయాలనూ పరిశీలిస్తున్నామన్నారు. విచారణకు సంబంధించిన నివేదికను కమిషనర్‌కు అందజేస్తామని తెలిపారు.

విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

- ఎన్నికల హామీల అమలు ఇంకెప్పుడు
- ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

గణేశ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, విద్యార్థులకు ఇచ్చిన ఎన్నికల హామీల అమలు చేయాలని ఏఐఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రభుతాన్ని డిమాండ్ చేశా రు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వాహించిన జిల్లా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 23 నెలలు గడిచినా విద్యార్థులకు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్ల సమస్యలకు నిలయంగా మారాయన్నాయ న్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు దుప్పట్లు రాక చలికాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమవుతున్నారని తెలి పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రవేశ పెట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌ లిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిబంధనలకు వ్యతి రేకంగా పని చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారావు వెంకటేష్, జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, జిల్లా ఆఫీస్ బేరర్ స్ మామిడిపల్లి హేమంత్, కనకం సాగర్, రాము యాదవ్, లద్దునూరి విష్ణు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



జిల్లా కేంద్ర గ్రంథాలయం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా కేంద్ర గ్రంధాయంలో శుక్రవారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహించ నున్నారు. దీని కోసం చైర్మన్ సత్తు మల్లేశం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్మార్ట్ సిటీ నిధులతో అన్ని హంగులతో కూడిన మూడంతస్థుల భవనం ఏర్పాటు కావాల్సి ఉంది. గత యేడు జూన్ 21న పనులు ప్రారంభం కాగా ప్రస్తుతం తగిన ఫర్నిచర్‌తో కూడిన భవన నిర్మాణ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి.

- నిర్వహించనున్న కార్యక్రమాలు

14న 10 గంటల నుంచి ప్రారంభ వేడుక, మా గ్రంథాలయం అనే అంశంపై చిత్రలేఖన పోటీ నిర్వహిస్తారు. 15న ఉదయం 11 గంటలకు పుస్తక ప్రదర్శన, గ్రంథాలయ అవగాహనపై వన్ మినెట్ మెమొరీ గేమ్, 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు గ్రంథాలయ అభివృద్ధిపై వ్యాసరచన పోటీ ఉంటుంది. 12 గంటలకు గంట పాటు నిశ్శబ్ద పఠనం. పుస్తక పఠన, డిజిటల్ పఠన ప్రాధాన్యంపై కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహిస్తారు. 16న ఉదయం 11 గంటలకు 7, 8 తరగతుల వారికి క్విజ్ ఉంటుంది. 17న ఉదయం 11 గంటలకు ధ్యానం వ్యక్తిత్వాభివృద్ధి తరగతులు, 12 గంటలకు కవి సమ్మేళనం నిర్వహిస్తారు. 18న ఉదయం 11 గంటలకు జ్ఞానం, చదువు అంశాలపై జానపద గేయాల పోటీ, 19న ఉదయం 11 గంటలకు పాఠశాల, కళాశాల విద్యార్థినులకు, మహిళలకు రంగోలీ పోటీ, 12 గంటలకు దివ్యాంగులకు చెస్, క్యారం పోటీలు ఉంటాయి. 20న ఉదయం 11 గంటలకు ముగింపు వేడుక నిర్వహిస్తారు.

వారోత్సవాలను విజయవంతం చేయాలి

- సత్తు మల్లేశం, జిల్లా గ్రంథాలయ చైర్మన్



జ్ఞానం, ఆలోచన, చైతన్యం పంచే ఆలయాలు గ్రంధాలయాలు. పుస్తకాలు చదవడంపై ఆసక్తిని కలిగించి అందరినీ మరింత ఉన్నత విజ్ఞానవంతులుగా చేయడమే మా లక్ష్యం. పౌరులు, విద్యార్థులు, మేధావులు, నాయకులు, అధికారులు, పాఠకులు, గ్రంధాలయాల అభిమానులు వారోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలి.

విద్యాశాఖ కార్యక్రమాలు భేష్

- కలెక్టర్‌ను ప్రశంసించిన విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



కలెక్టర్ పమేలా సత్పతితో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

కరీంనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కలెక్టర్ పమేలాసత్పతి నేతృత్వంలో విద్యారంగ అభివృద్ధికి చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు బాగున్నాయని రాష్ట్ర విద్యా కమి షన్ చైర్మన్ ఆకునూరి మురళి ప్రశంసించారు. ఆయన జిల్లాలో విద్యారంగ అభివృద్ధిపై కలెక్టర్, విద్యాశాఖ అధికారులతో సమీక్ష గురు వారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిం చారు. అనంతరం విద్యాశాఖ చైర్మన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ 20 అంశాలకుపైగా విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, ఆయనతో చర్చించి రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు అమలయ్యేం దుకు కృషి చేస్తానని తెలి పారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 మండలాల్లో మండలానికి ఒకటి చొప్పున తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాకు మంచిపేరు తీసుకురావాలనే ఉద్దేశంతో విద్యారంగంలో నూతన కార్యక్రమాలను చేపడుతూ వాటి అమలు కోసం కష్టప డుతున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. విద్యాశాఖ అధికారులతో కలిసి సమష్టిగా విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామ న్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యా యులు తల్లిదండ్రులు సహకరిస్తున్నారని తెలి పారు. కార్యక్రమంలో డీఈవో మొండయ్య, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్‌రెడ్డి, ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, జెండర్ కో ఆర్డినేటర్ కృపారాణి, డీసీఈబీ సెక్రెటరీ భగవంతయ్య, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ రవీందర్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

- ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

వీణవంక: ప్రభుత్వ పాఠశాలలో చదువు తున్న ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. వీణవంక మండలం చల్లూరుజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తని ఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మార్కుల జాబితాను ఉపాధ్యా యులు పరిశీలించాలని, తక్కువ మార్కులు వచ్చే సబ్జెక్‌లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మండలంలోని పాఠశాలల వివ రాలను ఎంఈవో శోభరాణిని అడిగి తెలుసు కున్నారు. చల్లూరు పాఠశాల నిర్వహిస్తున్న యూట్యూబ్ చానల్‌లో విద్యార్థులు వార్తలు చదవడం అభినందనీయం అని ప్రశంసిం చారు. ఓ విద్యార్థికి పెను బహూకరించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ వివ రాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూపీఎస్ ఉర్దుమీడియం పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలను విద్యా కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారి స్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుపమారావు, ఎంపీవో సురేందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


ఈశ్వరయ్య(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని పద్మనగర్ బైపాస్ రోడ్డు జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లి మండలం చింతకుంట రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్న కొడిమ్యాల మండలం రాముని పల్లికి చెందిన గడ్డం ఈశ్వరయ్య(34) దుర్మరణం చెందాడు. పెయింట్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న ఈశ్వరయ్య ఉదయం 10 గంటల సమయంలో చింతకుంట నుంచి స్నేహితుడు చిరంజీవితో కలిసి కోతిరాంపూర్‌కు ద్విచక్రవాహనంపై వెళుతుండగా వెనుక నుంచి లారీ ఓవర్‌టేక్ చేస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఈశ్వరయ్య రోడ్డుపై పడగా అతని పైనుంచి లారీ వెళ్లటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. చిరంజీవికి కూడా గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

సుల్తానాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నపల్లి, గర్రెపల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. బుధవారం రాత్రి రాజీవ్ రహదారిపై ప్రమాదం జరుగగా ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వీరిలో పెద్దపల్లి పట్టణం భూంనగర్‌కు చెందిన భాను విజయానంద్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కుమారుడి వివాహ పత్రికలను బంధువులకు పంచడానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. మృతుడు మంచిర్యాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరికి తీవ్రగాయాలు

రుద్రంగి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులోని మానాల ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి శివారులోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిలోని మానాల ఎక్స్‌రోడ్డు వద్ద ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని టీఎస్ 23 టీ 4536 నంబర్‌గల ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్‌పైన ఉన్న రుద్రంగికి చెందిన బీమనాతి మురళి అనే వ్యక్తితోపాటు ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి తీవ్రగాయాలు కావడంతో వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ చెల్లింపులకే ప్రాధాన్యం



- ఆన్‌లైన్‌లోనే విద్యుత్ బిల్లుల చెల్లింపులు
- క్యూలో నిలుచునే బాధ తప్పిందంటున్న వినియోగదారులు

గణేశ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు చెల్లించేందుకు ఇది వరకు ఎన్‌పీడీసీఎల్ బిల్లుల కేంద్రాల వద్ద వినియోగదారులు బారులు తీరేవారు. గడువు తేదీ వస్తే ఒక్కోసారి గంటల తరబడి నిలుచుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం పరిస్థితి మారింది. చాలా మంది డిజిటల్ చెల్లింపులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. విద్యుత్ అధికారులు డిజిటల్ చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. వినియోగదారుల సౌలభ్యం కోసం నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎన్‌పీడీసీఎల్) డిజిటల్ చెల్లింపుల విధానాన్ని విస్తృతంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతి ఏటా 10 శాతం విద్యుత్ వినియోగదారులు తమ తమ నెల వారి విద్యుత్ బిల్లులను టీజీఎన్‌పీడీసీఎల్ యాప్, టి వ్యాలెట్, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా చెల్లిస్తున్నారు. గత ఏడాది 2024 సంవత్సరంలో 10,93,689 వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపు చేయగా ఈ ఏడాది నవంబర్ 11 వరకు 14,66,588 మంది వినియోగదారులు చెల్లించారు.

● అవగాహన అవసరం..

నగరం, పట్టణాలు, మండల కేంద్రాల్లో చదువుకున్న వారు మాత్రమే డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య తక్కువగా ఉంది. ఆయా చోట్ల వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో డిజిటల్ చెల్లింపులు 30 శాతం కూడా దాటట్లేదు. బిల్లు జారీ చేసిన పదిహేను రోజుల్లో చెల్లించాలి. లేకపోతే 75 నుంచి 150 రూపాయల వరకు జరిమానా రూపంలో కట్టాల్సి ఉంటుంది. డిజిటల్ చెల్లింపులు చేస్తే చివరి తేదీపై నోటిఫికేషన్లు వస్తుంటాయి. కొన్ని ప్లాట్‌ఫారాల్లో ఆటో పే ఆప్షన్ కూడా ఉంది. కార్యాలయ కౌంటర్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఎక్కడి నుంచైనా నిమి షాల వ్యవధిలో చెల్లించవచ్చు. చెల్లించిన తర్వాత వెంటనే లావాదేవీ నమోదవుతుంది.

ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు సులభం

- మేక రమేష్‌బాబు, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ



విద్యుత్ వినియోగదారులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లోని ప్లే స్టోర్ లో టీజీఎన్‌పీడీసీఎల్ అని టైప్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో విద్యుత్ బిల్లు పై ఉన్న యుఎస్సీ నంబర్ నమోదు చేసుకుని విద్యుత్ బిల్లు చెల్లించవచ్చు. ఈ విధానంలో బిల్లు రాగానే నోటిఫికేషన్ వస్తుంది. టీజీఎన్‌పీడీసీఎల్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా బిల్లుల చెల్లింపును సులభతరం చేసింది. వినియోగదారులు బిల్లులను డిజిటల్ రూపంలో చెల్లించి సమయాన్ని ఆదా చేసుకోవాలి.

పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలి

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం


ధర్మపోరాట దీక్షలో నినాదాలు చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచడానికి పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య అన్నారు. గురువారం బీసీ జేఏసీ నాయకుడు దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్మపోరాట దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసి తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. మేమెంతో మాకంత వాటాలు కావాలని కోరారు.

కేంద్రంపై ఒత్తిడి చేసేందుకు వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగానే ఈ దీక్షతోపాటు ఈనెల 16న రన్ ఫర్ సోషల్ జస్టిస్, 18న ఎంపీలతో ములాకాత్, 23న అఖిలపక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. డిసెంబరు మొదటి వారంలో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. ఈదీక్షకు తెలంగాణ జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో బీసీ జేఏసీ నాయకులు జీఎస్ ఆనంద్, దేవరకొండ సంతోషి లక్ష్మి, మంతెన కిరణ్, వాయిల రాజ్‌కుమార్, గుమ్మడి శ్రీనివాస్, అశిష్, బియ్యని తిరుపతి, రవీంద్రాచారి, రామ్మూర్తి, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

సంపులో పడిన ఆవు.. రక్షించిన ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఒక నీటి సంపులో పడిన ఆవును కరీంనగర్ ఫైర్ సిబ్బంది రక్షించారు. గురువారం ఉదయం ఒక ఆవు కలెక్టరేట్ క్యాంటీన్ వద్ద ఉన్న నీటి సంపులో ప్రమాదవశాత్తు పడిపోయింది. సమాచారం అందడంతో కరీంనగర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది అక్కడికి వెళ్లి ఆవును క్షేమంగా బయటకు తీశారు.

విషాహారం తిని గొర్రెలు మృతి

ధర్మారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విషాహారం తిని 10 గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని కటికెనపల్లిలో చోటు చేసుకుంది. కటికెనపల్లి గ్రామానికి చెందిన ఆవుల మల్లేశంనకు 30 గొర్రెల వరకు ఉండగా వాటిని మేపేందుకు శివారులోని ఊర చెరువు సమీపంలోకి వెళ్లారు. బుధవారం సాయంత్రం మేత మేసిన గొర్రెలు ఇంటికి వచ్చే సమయంలో అప్పుడే కోసిన పొలంలో విషాహారం తిని అస్వస్థతకు గురయ్యాయి. గురువారం ఉదయం ప్రాణాపాయస్థితిలో ఉన్న గొర్రెలకు చికిత్స అందించేలోపే 10 గొర్రెలు మృత్యువాత పడ్డాయని మిగత గొర్రెలు తీవ్ర అస్వస్థతతో ఉన్నాయని యజమాని మల్లేశం తెలిపారు. గొర్రెల మృతితో ఆర్థికంగా నష్టపోయిన తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వృద్ధురాలి ఆత్మహత్య

ఓదెల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పురుగుల మందు త్రాగి రామినేని కనకమ్మ (67) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. మతిస్థిమితం సరిగాలేక జీవితంపై విరక్తి చెంది, బుధవారం తన ఇంటిలో ఎవరు లేని సమయంలో పురుగులమందు తాగింది. కుమారుడు గమనించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు రామినేని కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి పోలీసులు తెలిపారు.

కాపర్ తీగ చోరీ

వీణవంక, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపల్లి పరిధిలోని ఐలాబాద్ గ్రామ శివారులో వ్యవసాయ భూమిలో గల 25కెవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైర్‌ను గుర్తు తెలియని నిందితులు ఎత్తుకెళ్లినట్లు చల్లూరు ఏఈ కాంతామళ్ల శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో సత్తాచాటిన విద్యార్థులు


లాస్యను మెమోంటోతో అభినందిస్తున్న అధ్యక్షుడు బాల్‌రాజు

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో సిరిసిల్ల పట్టణ విద్యార్థులు సత్తా చాటారు. గురువారం ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయా పాఠశాలలో మెమోంటోలతో విద్యార్థులను అభినందించారు. సిరిసిల్ల నెహ్రూనగర్‌కు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన సాకేత్, ఆడెపు లిఖిత్‌లను ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ, ఉపాధ్యాయులు అభినందించారు.

సిరిసిల్ల అంబేద్కర్‌నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని యెన్నం లాస్య టాలెంట్ టెస్టులో అత్యుత్తమ ప్రతిభను కనబరచగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, ప్రధానోపాధ్యాయురాలు ఎన్ రమాదేవి, ఉపాధ్యాయులు మెమోంటోను అందించి అభినందించారు.


విద్యార్థులు సాకేత్, లిఖిత్

గ్యాస్ సిలిండర్ లీకై చెలరేగిన మంటలు


కాలిపోయిన వంట గది

ఎల్లారెడ్డిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుమాలకు చెందిన మహేందర్‌రెడ్డి ఇంటిలో గురువారం గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. భారీ మంటలు ఎగిసిపడడంతో వంట గదిలోని తినుబండారాలు, వస్తువులు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఘటనలో సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నారు. మహేందర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓ శుభకార్యానికి వెళ్లాడు. ఇంట్లోని వంట గది నుంచి పొగలు, మంటలు రావడం గమనించిన చుట్టుపక్కల వారు ఆయనకు సమాచారం అందించారు. ఇంటికి చేరుకున్న మహేందర్‌రెడ్డి తాళం తీసి చూసే సరికి మంటలు వ్యాపిస్తున్నాయి. అగ్నిమాపక సిబ్బంది, చుట్టు పక్కల వారి సహాయంతో కలిసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

ఐదుగురిపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని సీతారాంపూర్‌కు చెందిన భూవివాదంలో ఐదుగురిపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపూర్‌కు చెందిన కాసర్ల హన్మంతుకు కొట్టె తిరుపతి, కొట్టె శంకర్, కొట్టె వెంకటేశం, కొట్టె అశోక్, కొట్టె సుధాకర్‌ల మధ్య భూ వివాదం ఉంది. బుధవారం రాత్రి కాసర్ల హన్మంతు భూమిలోకి ప్రవేశించిన ఐదుగురు ప్రహరీ కూల్చివేసినట్లు గురువారం వారిని అడుగగా భూమి తమని చంపుతామని బెదిరించినట్లు బాధితుడు కొత్తపల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముత్తారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాడిచర్ల ఓసీపీలో కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్న ముత్తారం మండలానికి చెందిన ఇద్దరు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మండలంలోని కేశనపల్లికి చెందిన రాంపల్లి శ్రీధర్, మధుకర్‌గౌడ్ తాడిచర్ల ఓసీపీలో విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి బుధవారం వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా అడవి పందులు అడ్డువచ్చి వాహనాన్ని ఢీకొన్నాయి. దీంతో వారు కింద పడి గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు ముత్తారం ఆర్‌పీఎం వద్ద ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని రైల్వేగేట్ వద్ద ఒకటి, బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద మరొక ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్లను పట్టుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ తెలిపారు.

వీణవంక: మండలంలోని కోర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గురువారం పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకటరెడ్డి తెలిపారు.

శంకరపట్నం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన గుడెపు బాలకృష్ణ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా కేశవపట్నం శివారులో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రపంచ వ్యవసాయ సదస్సులో కోనరావుపేట రైతులు


తెలంగాణలో చేస్తున్న వ్యవసాయంపై జర్మనీ నిపుణులకు వివరిస్తున్న నాగరాజు

కోనరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జర్మనీలో జరుగుతున్న అంతర్జాతీయ వ్యవసాయ సదస్సులో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన కాతుబండ శ్రీనివాస్, కాటిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, నాగారం గ్రామానికి చెందిన ధూమ్‌పేట నాగరాజు గురువారం పాల్గొన్నారు. సదస్సులో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు సుస్థిర సాగు విధానాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఆవిష్కరణలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు, మార్గదర్శకులు సదస్సులో చర్చించినట్లు రైతు దూంపేట నాగరాజు తెలిపారు. ఈ సదస్సులో ధూంపేట్ నాగరాజు వ్యవసాయంపై జరిగిన చర్చల్లో పాల్గొని రాష్ట్రంలో రైతులు చేస్తున్న వ్యవసాయ సాగుపై వివరించారు. రాష్ట్రంలో వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్నాయని, అక్కడి రైతులు ఫర్టిలైజర్ క్రిమిసంహారక మందులు ఎక్కువ వాడుతున్నారని, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి ఇచ్చే సాంకేతిక పరిజ్ఞానం అందించాలని కోరారు. ఈ సదస్సులో వెదర్ స్టేషన్ల ద్వారా డేటా సేకరణ, నేల నాణ్యత విశ్లేషణ, స్మార్ట్ అగ్రికల్చర్, టెక్నాలజీ వంటి అంశాలలో ప్రాక్టికల్‌గా జర్మనీ వ్యవసాయ నిపుణులకు చూపించామని తెలిపారు. ఈ సదస్సులో తెలంగాణ అగ్రికల్చర్ శాఖ, అక్రర్డ్ ప్రాజెక్టు అధికారులు నాగరాజు ప్రతిభను ప్రశంసిస్తూ అభినందించినట్లు తెలిపారు.

పెద్దబొంకూర్‌లో చోరీ

పెద్దపల్లి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబొంకూర్‌లో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామానికి చెందిన వేముల రమేష్ బుధవారం ఇంటికి తాళం వేసి కూతురు ఇంటికి వెళ్లాడు. గురువారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి గేట్ తాళం వేసి ఉండగా తలుపునకు ఉన్న తాళం పగలగొట్టి ఉండటంతో బాధితుడు రమేష్ 100కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పెద్దపల్లి రూరల్ పోలీసులు చేరుకొని పరిశీలించగా ఇంట్లో రెండు బీరువా తాళాలు పగలగొట్టడంతో పాటు, బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని అరతులం బంగారం, ఐదు వేల రూపాయల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ముగ్గురు వ్యక్తులు సంచరిస్తున్న సీసీ ఫుటేజి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ముగిసిన ఎంజేపీ పాఠశాలల ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ మీట్



తిమ్మాపూర్‌లోని ఎంజేపీలో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న సీఐ సదన్‌కుమార్, సుల్తానాబాద్‌లో అతిథులు..

తిమ్మాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 11న ప్రారంభమైన సీనియర్, జూనియర్ బాలికల ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలు గురువారం ముగిశాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అండర్ -14, అండర్-19 అంశాలలో 15 ఎంజేపీ పాఠశాలలు, 15 క్రీడాంశాలలో 636మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌సివో అంజలి, ప్రిన్సిపాల్స్ సరిత, సృజన, విమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● విజేతలుగా సుల్తానాబాద్, బీర్పూర్ జట్టు

సుల్తానాబాద్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 14, 19 విభాగంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో సుల్తానాబాద్, జగిత్యాల జిల్లా బీర్పూర్ జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించి, విజేతగా నిలిచాయి. మండలంలోని భూపతిపూర్‌లోని జ్యోతిరావుపూలే గురుకులంలో మూడు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. విజేతలకు ముఖ్యఅతిథిగా రామగుండం గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ శిరీష చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని 14 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. సుల్తానాబాద్ జట్టు అండర్ 19 విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌తోపాటు వ్యక్తిగత చాంపియన్ షిప్‌ను అంజి గెలుచుకున్నారు. అలాగే అండర్ 14లో ఓవరాల్‌గా బీర్పూర్ జట్టు సాధించగా, విజయ్ వ్యక్తిగత చాంపియన్‌గా నిలిచాడు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి ప్రిన్సిపాల్ జయసింగ్, సుల్తానాబాద్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ సురేష్, సంక్షేమ అధికారి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మెట్‌పల్లిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని టీచర్స్ కాలనీలో గురువారం అనుమానాస్పద స్థితిలో ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన బగ్గాల లక్ష్మి అలియాస్ నేరెళ్ల రాజగంగు(50) మృతిచెందింది. మెట్‌పల్లి ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన లక్ష్మికి ఇద్దరు కూతుళ్లు కాగా పెళ్లిలు చేసిన అనంతరం భర్తతో విడిపోయి మెట్‌పల్లి పట్టణంలో ఒంటరిగా నివాసం ఉంటోంది. లక్ష్మి కొంతకాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతోంది.

బుధవారం ఆమె ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు ఆమె చిన్నకూతురు అనూషకు సమాచారం ఇచ్చారు. ఆమె ఇంటికి వచ్చి చూసే సరికి మంచంపై లక్ష్మి మృతదేహం నగ్నంగా ఉన్నట్లు తెలిపారు. లక్ష్మి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ చిన్న కూతురు అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ వివరించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


ధనుష్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి ధనుష్ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. సిరిసిల్ల పట్టణం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ధనుష్ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, వ్యాయామ ఉపాధ్యాయుడు తడక సురేష్, ఉపాధ్యాయులు గురువారం మెమోంటోతో అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపా ధ్యాయురాలు శారద మాట్లాడుతూ శుక్రవారం, శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని డాన్ బాస్కో అకాడమిలో జరగునున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ధనుష్ పాల్గొంటారని అన్నారు.

ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సమీక్ష


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జోన్ ఈడీ పగిడిమర్రి సోలమన్

భగత్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జోన్ పరిధిలోని రీజినల్ మేనేజర్లు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లతో కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని రీజియన్ల పనితీరు, ఆర్థిక పరిస్థితి, ప్రమాదాల నివారణ చర్యలు, రానున్న మేడారం జాతరకు సన్నద్ధతను సమీక్షించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్లు బి రాజు, డి విజయభాను, టి జ్యోత్స్న, ఎ సరిరాం, ఎస్ భవాని ప్రసాద్, డిప్యూటి రీజినల్ మేనేజర్లు ఎస్ భూపతిరెడ్డి, ఎస్ మధుసూదన్, కె భానుకిరణ్, మహేష్, వి మల్లయ్య, ఎస్ రామయ్య, డి శ్రీహర్ష, డిప్యూటి చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ స్వప్నకుమారి, ఎస్ ప్రణీత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యదర్శి కె యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో మంత్రి లక్ష్మణ్‌కుమార్ పూజలు



పూజలు చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం ఉదయం సందర్శించారు. ఆలయం పక్షాన వేదపండితులు, అర్చకులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మొదట ఆయన ధ్వజ స్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శనం చేసుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు మంత్రి యమధర్మ రాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోశారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను ఆలయం పక్షాన ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి ఘనంగా ఆశీర్వదించారు.

ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, చిలుముల లక్ష్మణ్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, సీపతి సత్యనారాయణ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి డీఎడ్ పరీక్షలు

కరీంనగర్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డీఎడ్ మొదటి సంవత్సరం పరీక్షలు డిసెంబర్ 1 నుండి 6వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్ హైస్కూల్), ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు (ఉర్దూ) ముకరంపుర లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

దక్షిణాదికి విద్యుత్ అందిస్తున్న రామగుండం ఎన్టీపీసీ..!

- నేడు వ్యవస్థాపక దినోత్సవం
- సీఎస్ఆర్ నిధులతో సామాజిక కార్యక్రమాలు





ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన అప్పటి ప్రధాని మొరార్జీదేశాయ్(ఫైల్)

జ్యోతినగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది విద్యుత్ అవసరాలను తీర్చంలో రామగుండం ఎన్టీపీసీ కీలక పాత్ర పోషిస్తున్నది. యేటా ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ విస్తరణ దిశగా అడుగులు వేస్తున్నది. 1978 నవంబరు 14 అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ చేతుల మీదుగా పునాది రాయి పడింది. నిర్ణీత గడువు కన్నా ముందే ఉత్పత్తిని ప్రారంభించాయి. ఈ ప్రాజెక్టులో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు రోజుకు 42 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం ఉంటుంది. 2100 మెగావాట్ల సామర్థ్యం ఉన్న స్టేజ్ 1, స్టేజ్ 2 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తికి సింగరేణి నుంచి రోజుకు 32వేల మెట్రిక్ టన్నులు, ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి 8వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఒప్పందం ఉంది. ప్రాజెక్టు అవసరమైన 6.5 టీఎంసీల నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నిల్వ ఉంచుతారు.

ప్రాజెక్టుకు అవార్డులు.. రివార్డులు..

రామగుండం ఎన్టీపీసీకి 47 సంవత్సరాలలో అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. 2025 ఎనర్జీ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. రాజ్ భాష హిందీ అమలులో ప్రాజెక్టుకు కేంద్రం నుంచి జాతీయస్థాయి పురస్కారం లభించింది. టిఎస్‌టిపిపికి నేషనల్ సేఫ్టీ 2025 అవార్డు లభించింది.

ఏ రాష్ట్రానికి ఎంత విద్యుత్...

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు 754 మెగావాట్లు(29శాతం)
- తమిళనాడుకు 572 మెగావాట్లు(22శాతం)
- కర్నాటకకు 416 మెగావాట్లు(16శాతం)
- కేరళకు 312 మెగావాట్లు(12శాతం)
- గోవాకు 130 మెగావాట్లు(5శాతం)
- పాండిచ్చేరికి 52 మెగావాట్లు(2శాతం)
- ఎవరికీ కేటాయించనిది(అన్ అలాటెడ్) 364మెగావాట్లు(14శాతం)

సామాజిక బాధ్యత..

విద్యుత్ ఉత్పత్తితోపాటు ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నది. సీఎస్ఆర్ నిధులు వివిధ కార్యక్రమాలకు ఖర్చు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, గ్రామాలలో వసతుల కల్పన, విద్య, ఆరోగ్యం, స్వయం ఉపాధి కోసం సంస్థ చేయూతనిస్తోంది. విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, ఉపకార వేతనాల కార్యక్రమాలను చేపట్టింది.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ఎన్టీపీసీ పరిసర ప్రాంతంలో సుమారు 14 లక్షల చెట్లను సంస్థ సంరక్షిస్తున్నది. ప్రాజెక్టు నుంచి వెలువడే బూడిద సమస్యను నివారించడానికి ఎన్టీపీసీ వినూత్న పథకాలను అమలు చేస్తోంది. పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రాజెక్టుకు ఐఎస్‌వో-14001 గుర్తింపు లభించింది.

టిఎస్‌టిపిపి స్టేజ్ 2 నిర్మాణానికి రెడీ..

రామగుండం ఎన్టీపీసీ ఆవరణలో 4000 మెగావాట్ల మరో ప్రాజెక్టును నిర్మిస్తోంది. మొదటి దశలో 800 మెగావాట్ల రెండు యూనిట్లు పూర్తయ్యాయి. మరో 2400 మెగావాట్ల నిర్మాణం జరగనుంది.

సమష్టి కృషితో ప్రగతి పథంలో

- ఈడీ చందన్ కుమార్ సామంత

ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్టు కార్మికుల సమష్టి కృషి ఫలితంగా రామగుండం ప్రాజెక్టు ప్రగతిపథంలో నడుస్తోంది. రక్షణతో కూడిన నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్య తనిస్తాం. ఉత్పత్తి, రక్షణ, పర్యావరణ పరిరక్షణ, సీఎస్ఆర్, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం. ఎన్టీపీసీ రేజింగ్ డే సందర్భంగా సిబ్బందికి, ఈ ప్రాంత ప్రజలకు శుభాకాంక్షలు.

యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభ వివరాలు

స్టేజ్-1
200 మెగావాట్ల 1వ యూనిట్ 1983 అక్టోబర్ 26
200 మెగావాట్ల 2వ యూనిట్ 1984 మే
200 మెగావాట్ల 3వ యూనిట్ 1984 డిసెంబర్

స్టేజ్-2
500 మెగావాట్ల 4వ యూనిట్ 1988 జనవరి
500 మెగావాట్ల 5వ యూనిట్ 1989 మార్చి
500 మెగావాట్ల 6వ యూనిట్ 1989 అక్టోబర్

స్టేజ్-3
500 మెగావాట్ల 7వ యూనిట్ 2004 సెప్టెంబర్

శ్రీరాంసాగర్‌కు 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీరు స్థిరంగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఇసుక డంప్ సీజ్



అధికారులు సీజ్ చేసిన ఇసుక డంపు

సుల్తానాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్‌లో ఇసుక అక్రమ డంప్‌ను జిల్లా అధికారులు పట్టుకున్నారు. ఇక్కడి నుంచి కొన్ని నెలలుగా హైదరాబాద్, కరీంనగర్ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని అధికారులు తెలిపారు. జిల్లా మైనింగ్ ఏడీ శ్రీనివాస్ వివరాల మేరకు మండలంలోని నారాయణపూర్‌లో ఒక పాతరైస్ మిల్లు వద్ద ఇసుకను అక్రమంగా డంపు చేస్తున్నారని, మండలంలోని మానేరు పరివాహక ప్రాంత గ్రామాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకువచ్చి ఇక్కడ నిల్వ చేస్తున్నారని వివరించారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున నిఘా పెట్టి పట్టుకున్నామన్నారు. నారాయణపూర్ రైస్ మిల్‌లో ఇసుక కుప్పలుగా పోసి రాత్రి వేళల్లో కరీంనగర్, హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. తెల్లవారుజామున రెండు లారీలు, ఒక జీపును సీజ్ చేసి ఆర్డీవో ఆఫీసుకు తరలించినట్లు ఆయన తెలిపారు. అధికారుల ఆకస్మిక దాడిలో కొన్ని వాహనాలను తప్పించినట్లు తెలిసింది.

కొండగట్టులో ఆర్జితసేవల ధరల పెంపునకు బ్రేక్

- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు
- ధరలు పెంచొద్దని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

మల్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ఈ నెల 15నుంచి ఆర్జిత సేవల టికెట్ల రెట్లను రెట్టింపు చేస్తూ మరిన్ని కొత్తగా అర్జితసేవలను ప్రారంభించనున్నట్లు ఇటీవల దేవస్థానం అధికారులు ప్రకటించగా వాటి అమలును వాయిదా వేస్తున్నట్లు ఈవో శ్రీకాంత్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూజ టికెట్ల పెంపు భక్తులకు భారం కానుందని భక్తులు, హిందూ సంస్థలు, రాజకీయ పార్టీల నుంచి వ్యతిరేకత వచ్చింది. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ దేవాదాయ శాఖ కమిషనర్, దేవస్థానం ఈవోతో గురువారం ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో టికెట్ల పెంపు అమలు వాయిదా వేసినట్లు తెలుస్తోంది. భక్తులకు కనీస వసతులు కల్పించక అనేక ఇబ్బందుల పడుతుంటే రాబడే ధ్యేయంగా టికెట్ల పెంపు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తడంతో దేవస్థానం అధికారులు పెంపు యోచనకు తాత్కాలికంగా బ్రేక్ వేశారు. నూతనంగా సుప్రభాతసేవ, వడమాల భోగము, మన్యసూక్త హోమం, శనిగ్రహ పీడ నివారణ ప్రవేశపెట్టారు. గతంలో నుంచి కొనసాగుతున్న అభిషేక పూజ, చందనం పూజ, గండదీపం, శాశ్వత అభిషేకం, 11 రోజుల హారతి అర్జిత సేవల ధరలను భారీగా పెంచారు. వీటి అమలును అధికారులు వాయిదా వేశారు. కొండగట్టుకు వచ్చేది అత్యధికంగా సామన్య భక్తులేనని అయితే ధరల పెంపు భక్తులకు భారం అవుతుందని అన్నివర్గాల నుంచి నిరసనలు రావడం, ఇటీవల బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు దేవస్థానం అధికారులకు ధరలు పెంచొద్దని వినతిపత్రం అందించారు. ఈనెల 15 నుంచి ప్రారంభించే నూతన పూజలలోని సుప్రబాత సేవను మంగళవారం దేవస్థానం అధికారులు ప్రారంభించి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. అయితే నూతన అర్జిత సేవలు, టికెట్ల పెంపు వాయిదా వేస్తున్నటుట్లు గురువారం అధికారులు ప్రకటించడం గమనార్హం. ఎట్టకేలకు టికెట్ల ధరల పెంపు వాయిదా పడడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఈవో శ్రీకాంత్‌రావును సంప్రదించగా భక్తుల నుంచి అభ్యంతరాలు, పార్టీల నుంచి వినతులు రావడంతో ఎండోమెంట్ కమిషనర్ దృష్టికి తీసుకెళతానని వారికి హామీ ఇచ్చిన మేరకు కమిషనర్‌కు నివేదించినట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యలు మళ్లీ ప్రకటిస్తామని పేర్కొన్నారు.



శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము కొండగట్టు

గ్రా॥ ముత్యంపేట, మం॥ మల్యాల, జిల్లా॥ జగిత్యాల

క్ర.సం.	ఆర్జిత సేవా వివరములు	రుసుము
1.	సుప్రభాత సేవ	1000-00
2.	చందనం(సింధూరం) పూజలో	1500-00
3.	మన్యసూక్త హోమం	2000-00
4.	[illegible]	1116-00
5.	శనిగ్రహ పీడ నివారణ పూజ	1000-00
6.	అంతరాలయ దర్శనం	800-00

ఆలయంలో ఏర్పాటు చేసిన ధరల సూచిక

భక్తుల సౌకర్యాలపై దృష్టి సారించాలి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి)/మల్యాల: కొండగట్టులో పెంచిన అర్జిత సేవా టిక్కెట్ల రేట్లను తగ్గించి, భక్తుల సౌకర్యాలపై దృష్టి సారించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దేవాదాయ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కొండగట్టులో భక్తులకు ఆర్జిత సేవా టికెట్లు పెంపుపై మల్యాల బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం కేంద్ర మంత్రి హోంశాఖ సహాయ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆలయ అధికారులపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. కొండగట్టు ఆలయంలో కనీస సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, సౌకర్యాల మీద దృష్టి సారించాల్సిన అధికారులు ఆర్జిత సేవా టికెట్ల ధరలు పెంచడ మేమిటని ప్రశ్నించారు. తక్షణమే పెంచిన ఆర్జిత సేవా టికెట్ల రేట్లను తగ్గించాలని, కొండగట్టులో కనీస సౌకర్యాల కల్పనపై దృష్టి సారించి భక్తుల ఇబ్బందులు తొలగించాలన్నారు.

శాతవాహనలో యాంటీ ర్యాగింగ్‌పై సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ కోటేశ్వర్, పక్కన ఎస్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుజాత

గణేశ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాంటీ ర్యాగింగ్, మహిళా భద్రత, మాదక ద్రవ్యాల నియంత్రణపై శాతవాహన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి మాట్లాడుతూ ర్యాగింగ్ చేసినట్టు తెలిస్తే కళాశాల నుంచి డిస్మిస్ చేయడమే కాకుండా పోలీస్ కేసు నమోదవుతుందన్నారు.

కొత్తపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, సేవించడం చట్టరీత్యా నేర మని అలాంటి విద్యార్థులు శిక్షార్హులు అవుతారని అన్నారు. షీ టీమ్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో ఎవరినీ వేధించవద్దన్నారు. కేసు నమోదైతే జీవితంలో వారికి ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగం రాదని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత మాట్లాడుతూ విద్యార్థులు అనవసర విషయాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ రమాకాంత్, చీఫ్ వార్డెన్ డాక్టర్ నజీముద్దీన్ మున్వర్, హాస్టల్ వార్డెన్స్ డాక్టర్ కృష్ణకుమార్, సావిత్రి, కేర్ టేకర్ సంధ్య, రమేష్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 23వ రోజు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌శర్మ భక్తులను ఉద్దేశించి ధార్మిక ప్రసంగం చేశారు. కార్తీక మాసం ఆరంభం నుంచి జరుగుతునన కార్యక్రమంలో భాగంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి వరకు నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, అర్చకలు, వేదపండితులు, శారదా మహిళా మండలి, వాసవి మహిళా మండలి సభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపు సభ్యులు, పెద్దపల్లి శ్రీ వల్లి సేవా గ్రూపు సభ్యులు, స్థానిక మహిళలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



గోదావరి మాతకు హారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

18న ఉమిద్ పోర్టల్ వక్ఫ్‌పై అవగాహన సదస్సు

కరీంనగర్ అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమిద్ పోర్టల్ వక్ఫ్‌పై ఉమ్మడి జిల్లా అవగాహన సదస్సును ఈ నెల 18న నిర్వహిస్తున్నామని, సదస్సుకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని జిల్లా వక్ఫ్ బోర్డు ప్రొటెక్షన్ డెవెలప్‌మెంట్ కమిటీ చైర్మన్ సమద్‌నవాబ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మా ట్లాడారు. నెల 18న నగరంలోని కరీంనగర్ ఫంక్షన్ హాల్‌లో ఉమిద్ పోర్టల్ వక్ఫ్‌కు సంబంధించిన మూడు అంశాల మీద చర్చ నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఈద్గా, దర్గా, ఖబ్రస్తాన్, మసీద్ , మదర్సా కమిటీ అధ్యక్షులు, సభ్యులు, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ నాయకులు, మైనారిటీ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ తాజుద్దీన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎండీ లయీక్, అబ్దుల్ రెహమాన్, ఎండీ చాంద్, ఇర్ఫాన్, మొహమ్మద్ ఖలీముద్దీన్, మహమ్మద్ ఆమేర్, మన్సూర్, తవక్కలి తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సమద్‌నవాబ్

తీయని బాధ

నేడు ప్రపంచ మధుమేహ దినోత్సవం

సుభాష్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చక్కెర.. ప్రతి మనిషి జీవితంలో కీలకపాత్ర వహిస్తుంది.. ఏదైనా శుభవార్త విన్నప్పుడు నోటిని తీపి చేసుకో అనడం పరిపాటి. ప్రస్తుతం ఆ నానుడి మారుతోంది.. ప్రతి ఒక్కరూ చక్కెరకు సాధ్యమైనంత దూరంగా ఉండండి అంటున్నారు. ఇందుకు కారణం మధుమేహం.. మన దేశంలో దాదాపు 12 కోట్లమంది డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. 14 కోట్లకు పైగా ప్రీడయాబెటిస్ (భవిష్యత్‌లో డయాబెటీస్ వచ్చేవారు) స్థితిలో ఉన్నారు. ఇన్సులిన్‌ను కనుగొన్న ఫ్రెడరిక్ బ్యాంటింగ్ జయంతి నవంబరు 14. ప్రపంచ వ్యాప్తంగా అతివేగంగా పెరుగుతున్న మధుమేహవ్యాధిని దృష్టిలో ఉంచుకొని ఐడీఎఫ్, (డబ్ల్యుహెచ్‌వో) ప్రపంచ ఆరోగ్య సంస్థలు సంయుక్తంగా ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి ప్రతి సంవత్సరం నవంబరు 14ను ప్రపంచ మధుమేహ దినంగా 1991 నుంచి నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సర నినాదం 'మధుమేహ వ్యాధి రోగుల శ్రేయస్సు'.



మధుమేహం అంటే ఏమిటి?

ఇన్సులిన్ శరీరంలో సరిగా తయారు కాకపోవడం వల్ల, ఇన్సులిన్ సరిగా ఉపయోగపడక పోవడంవల్ల రక్తంలో షుగర్ లెవల్ అతిగా పెరిగిపోతుంది. ఇది హానికరం. ఇది దీర్ఘకాలిక వ్యాధి. ఒక్కసారి వచ్చిందంటే జీవితాంతం ఉంటుంది. కాబట్టి ఈ జబ్బుకు వైద్యం చేసే సమయంలో రోగితో పాటు అతని కుటుంబ సభ్యులు కూడా బాధ్యత భాగం తీసుకోవాలి. జబ్బు లక్షణాలు, దాని ప్రభావాల గురించి అవగాహన పెంచుకొని షుగర్ లెవల్స్‌ను అదుపులో పెట్టుకోవాలి. సరైన వ్యాయామం చేస్తే, ఆహార నియమాలు, డాక్టర్ ఇచ్చే సలహాలు పాటించాలి. మధుమేహ రోగులు అదుపులో ఉన్న చక్కెర శాతంతో సాధారణ జీవితం గడపవచ్చు. కనీసం రోజుకు ఏడు గంటలు నిద్రపోవాలి. ధూమపానానికి, మద్యపానానికి దూరంగా ఉండండి. కొలెస్ట్రాల్‌ను, శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు

మధుమేహ రోగులు చిన్న మార్పులతో సాధారణ ఆహారం తీసుకోవచ్చు. చక్కెర, తీపివస్తువులు, వెన్న, నెయ్యి అతిగా నూనెలు వాడవద్దు. కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. తెల్లని బియ్యం, తెల్లని బ్రెడ్, మైదాపిండి వాడకం తగ్గించాలి. వాటి స్థానంలో దంపుడు బియ్యం, బ్రౌన్ బ్రెడ్, ఓట్స్ లాంటివి వాడటం మంచిది. తాజా కూరగాయల్ని, పండ్లను ఎక్కువగా తీసుకోవాలి.

వైద్యుల సలహాలు పాటించాలి..


- డాక్టర్ రఘురామన్, సీనియర్ ఫిజీషియన్



డయాబెటిక్ వచ్చినవారు సకాలంలో డాక్టర్‌ను సంప్రదించాలి. డాక్టర్ సూచించిన విధంగా మందులు వాడుతూ సలహాలు సూచనలు పాటించాలి. ఆహార నియమాలను పాటించాలి. డయాబెటిస్ ఉందని భయపడాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. మూడు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు మెరుగ్గా చేసుకొవాలి. సంవత్సరానికి ఒకసారి కంటి పరీక్ష, ఈసీజీ, కిడ్నీ పరీక్షలు చేసుకోవాలి. డయాబెటిస్ రాకుండా ఉండాలంటే తగినంత శారీరక శ్రమ చేస్తూ సమతుల్య ఆహారం తీసుకోవాలి. రోజు కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలి. ఒత్తిడిని తగ్గించుకోవాలి. పౌష్ఠికాహారం లోపంతో టైప్-5 డయాబెటీస్‌ను గుర్తించారు. ఈ విషయాన్ని ఇటీవల కేరళలో నిర్వహించిన అఖిల భారత మధుమేహ వైద్యుల సదస్సులో నిపుణులు వెల్లడించారు. సాధారణంగా వివిధ కారణాల వల్ల ప్రాంక్రియాస్ చెడిపోతే షుగర్ వ్యాధి వస్తుంది. కాని టైప్-5 పౌష్ఠికాహార లోపం వల్ల వస్తుందని గుర్తించారు. వీరు చూడడానికి సాధారణంగానే కనిపిస్తారు.

ప్రమాదకరంగా వరదకాలువ వంతెనలు

- కూలిన రక్షణ గోడలు



ముత్యంపేట శివారులో వాహనాలు ఢీకొనడంతో కూలిన రక్షణగోడ

మల్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరదకాలువ వంతెనల వద్ద నిర్మించిన రక్షణగోడలు కూలి ప్రమాదకరంగా మారాయి. మల్యాల మండలంలోని రాంపూర్, గొల్లపల్లె, రామన్నపేట, నూకపల్లి, ముత్యంపేట, సర్వాపూర్ గ్రామాల పరిధిలో గల వరదకాలువపై రహదారిపై వంతెనలు నిర్మించగా వాటి రక్షణగోడలు చాలా చోట్ల వాహనాలు ఢీకొని ధ్వంసం అయ్యాయి. టిప్పర్లు, ఇతరవాహనాలు ఢీకొనడంతో దెబ్బతింటున్నాయి. నెలల తరబడి వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.



వాహనం ఢీకొని ధ్వంసం అయిన రక్షణ గోడ

నిర్లక్ష్యానికి నిండుప్రాణాలు బలి

(5వ పేజీ తరువాయి)

డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు నిర్వహించడం ముఖ్యమే అయినా ట్రాఫిక్‌ను నియంత్రించడమూ కీలకమే.

● ఆక్రమణలకు గురవుతున్న ఫుట్‌పాత్‌లు

కరీంనగర్‌లో ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. చిరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. పెద్ద వ్యాపారులు తమ దుకాణాల ముందు ఉన్న ఫుట్ పాత్‌లను ఆక్రమించి సామగ్రిని ఏర్పాటు చేసు కుంటున్నారు. దీంతో పాదచారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. నగర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఇలాంటి దుకాణాలు, పూర్తిగా తొలగించడంతో పాటు చిరువ్యాపారులు ప్రత్యేక స్థలాల్లో వ్యాపారాలు నిర్వహించుకునేలా ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. ఇప్పటికే టవర్‌సర్కిల్, కూరగాయల మార్కెట్ ఏరియాలో రోడ్లపైనే వీధి వ్యాపారాలు నిర్వహించుకుంటుండటంతో అక్కడ నిత్యం రద్దీ నెలకొంటున్నది. అధికారులు స్పందించి జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

16న దుర్గా భవానీ ఆలయంలో లక్ష దీపోత్సవం

కరీంనగర్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గా భవానీ ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ ఆధ్వర్యంలో నెల16వ తేదీ ఆదివారం లక్ష దీపోత్సవం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, తులసికళ్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్ గురువారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

● కరీంనగర్ కల్చరల్ : నగర శివారులోని వేదభవనంలో ఈ నెల 20న సాయంత్రం 6 గంటల నుంచి కార్తీక దీపోత్సవం, లక్ష్మీనారాయణ కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చి మొక్కల తొలగింపు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కరీంనగర్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ నుంచి జూబ్లీనగర్ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ పిచ్చి మొక్కలతో కూడుకుపోయి ప్రమాకరంగా మారిందని గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సిబ్బందితో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న పిచ్చి మొక్కలను, ఎస్సారెస్పీ కాలువలో పెరిగిన గడ్డిని తొలగించారు.

పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించాలి

తిమ్మాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించాలని కరీంనగర్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ ఆదేశించారు. గురువారం మండలంలోని తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలోని ఎల్ఎండి, చిగురుమామిడి, గన్నేరువరం పోలీసుస్టేషన్లకు చెందిన రికార్డులను ఆయన పరిశీలించారు.ఎస్సైలు శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి, సాయికృష్ణలతో పాటు ఇతర అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల విద్యుత్ అంతరాయం

గణేశ్‌నగర్,నవంబరు13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్,ఏడిఈ, గాధం రఘు తెలిపారు. సీతారాంపూర్, జగిత్యాల రోడ్, సాయిబాలజీనగర్,ఆర్‌టిసి కాలనీ, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పీడీఎస్‌యూ నాయకులపై దాడి సరికాదు

కరీంనగర్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసేందుకు ప్రచారానికి వెళ్లిన పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్, మర్రి మహేశ్‌లను దుర్భాషలాడుతూ తీవ్రంగా గాయపరచడం దుర్మార్గమని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాణాప్రతాప్ ఒక ప్రకటనలో ఖండించారు. వారిపై దాడిచేసిన స్మైల్ డిజి పాఠశాల యజమాని శ్రీనివాస్ వర్మను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రిలో జరిగిన అవకతవకలపై త్వరితగతిన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధానకార్యదర్శి బండారి శేఖర్ విచారణ కమిటీ అధికారులకు వినతిపత్రం అందచేశారు.

డాక్టరేట్ పొందిన యువతికి బీజేపీ నాయకుల సన్మానం

భగత్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన నగరంలోని ఉస్మాన్‌పురకు చెందిన చుక్క లతను బీజేపీ నాయకులు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సొల్లు అజయ్‌వర్మ, డాక్టర్ పుల్లెల పవన్ సన్మానించారు.

సీపీఐ ప్రచారజాతాను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న జీపు జాతాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నవంబర్ 15 నుంచి జోడేఘాట్‌లో ప్రారంభమవుతున్న జీపుజాత ఈ నెల 17న కరీంనగర్ జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు.

డిస్కస్‌త్రోలో రాష్ట్రస్థాయికి ఎంపిక

భగత్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో జరిగిన డిస్కస్‌త్రో ఎస్‌జీఎఫ్ పోటీల్లో సెయింట్‌జార్జ్ ఇంటరేనేషనల్ (సిబిఎస్ఈ) పాఠశాల విద్యార్థి రిషికేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారున్ని సెయింట్ జార్జ్ పాఠ శాల ఛైర్మన్ డాక్టర్ పి ఫాతిమా రెడ్డి అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఫాతిమారెడ్డి

కార్మికుల రక్షణ కోసం నిరంతర పోరాటం

భగత్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల రక్షణ కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని భవన నిర్మాణ కార్మికుల జేఏసీ నాయకులు అన్నారు. గురువారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

క్విజ్ పోటీల్లో ఆర్నకొండ విద్యార్థికి ప్రథమ బహుమతి

చొప్పదండి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీహర్షిత్ రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించగా హెచ్ఎం శ్రీనివాస్ అభినందించారు.

ఇంగ్లీష్ నోట్స్ ఆవిష్కరణ

గణేశ్‌నగర్: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ పీజీ కళాశాలలో సీనియర్ ఆంగ్ల అధ్యాపకుడిగా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్న ధనపురి సాగర్ తయారు చేసిన డిగ్రీ 1వ సెమిస్టర్ (2025-26) నోట్స్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ ఆవిష్కరించారు. విద్యార్థులు నోట్స్‌ను ఉచితంగా పొందాలంటే ఫోన్ 8885549467 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలుపాలని సాగర్ కోరారు.

బీసీ రిజర్వేషన్ అమలు చేసే వరకు పోరాటం



చిగురుమామిడి బస్టాండ్‌లో దీక్ష చేస్తున్న బీసీ సంఘ నాయకులు



మానకొండూర్‌లో ధర్మ పోరాట దీక్ష చేస్తున్న బీసీ నాయకులు

చిగురుమామిడి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలయ్యే వరకు పోరాటం ఆగదని మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ అన్నారు. గురువారం చిగురుమామిడి మండల కేంద్రంలో రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు మండల బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల ధర్మపోరాట దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు 42 వాతం అమలయ్యే వరకు పోరాటం ఆగదన్నారు. విద్యా ఉద్యోగ, రాజకీయాల్లో జనాభా దామాషా పద్ధతిలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగబద్ధమని అన్నారు. దీక్షలో మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, ధర్మ సజమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేష్, చెల్పూరి విష్ణుమాచారి, సిరవేణి సంపత్, పెసరి మొగిలి, కందుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానకొండూర్: బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ అమలయ్యే వరకు ఉద్యమిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్‌గౌడ్ అన్నారు. మానకొండూర్‌లో గురువారం మండల బీసీ సంఘం ఆధ్వర్యంలో బీసీల ధర్మ పోరాట దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ముంజ శ్రీనివాస్, మండల అధ్యక్షులు వీర్ల దిలీప్‌కుమార్, మార్కొండ రమేశ్, నందగిరి బలరాం, మహిళా అధ్యక్షురాలు వీరగోని వరలక్ష్మీ, బండారి మల్లయ్య, కోల రమేశ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద మండల బీసీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ధర్మ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ స్థానిక సంస్థలు, చట్ట సభలు, శాసనసభలు, విద్య, ఉద్యోగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ పిలుపు మేరకు ఈ ధర్మ దీక్ష చేపట్టామన్నారు. రాజ్యాంగ సవరణ చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు భూపతి, సోమారపు రాజయ్య, గుండారపు శ్రీనివాస్, పూసాల అంజి, నీర్ల సతీష్, ఈరాల శ్రీనివాస్, పోలు ప్రవీణ్, రాజు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

15న ప్రత్యేక లోక్ అదాలత్

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో ఈ నెల 15న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి మూడు రోజులు చిల్డ్రన్ ఫిల్మ్ ఫెస్టివల్

కరీంనగర్ కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా కరీంనగర్ ఫిలింభవన్‌లో కఫిసొ, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శుక్ర, శని, ఆది వారాల్లో చిల్డ్రన్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు పొన్నం రవిచంద్ర, లక్ష్మీగౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులు బాలల చిత్రాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

మహాలక్ష్మీ అమ్మవారి వార్షికోత్సవం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక యజ్ఞవరాహ క్షేత్రంలో మహాలక్ష్మీ అమ్మవారి వార్షికోత్సవాన్ని శుక్ర, శనివారాల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఎస్‌వీఎస్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పుష్పాలతో విశేష అలంకరణల్లో దర్శనమివ్వనున్నట్లు తెలిపారు.

సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

కరీంనగర్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఈ నెల 14నుంచి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం సహకార వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా సమృద్ధి సాధించడానికి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు సన్మానం

హుజూరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో గురువారం రాత్రి హాకీలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను హాకీ క్లబ్ సభ్యులు సన్మానించారు. ఇటీవల జిల్లాలో జరిగిన హాకీ పోటీల్లో కరీంనగర్ జట్టుపై హుజూరాబాద్ జట్టు విజయం సాధించిందన్నారు. క్రీడాకారులను సన్మానించారు.

దేశభక్తి స్ఫూర్తిని రగిలించే వందేమాతరం గేయం

హుజూరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారతీయుల్లో దేశభక్తి స్ఫూర్తిని రగిలించే గేయమే వందేమాతరం అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వందేమాతరం 150వ వార్షికోత్సవ వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వందేమాతరం గేయాన్ని నవంబరు 7, 1875లో బంకిం చంద్ర సెటర్జీ రచించారన్నారు. ప్రధానంగా ఈ గీతం స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, భారతీయుల్లో చైతన్యాన్ని స్ఫూర్తి, దేశభక్తిని రగిల్చిందన్నారు. అలాంటి గొప్పనైన వందేమాతరం దేశ జాతీయ గేయమైందన్నారు. ఈ నెల 26వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో వందేమాతరం గేయాన్ని ఆలపించడానికి, వేడుకలను ఘనంగా నిర్వహించడానికి తగిన కార్యాచరణతో ముందుకు కొనసాగుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, కుమార్, వేణు, కరుణాకర్, శ్రీనివాస్, ప్రభాకర్, రాజు, రాజిరెడ్డి, శశిధర్, వాసు, సుమన్, సంజీవ్, సంపత్, చంద్రిక, తిరుపతి, భూమిరెడ్డి, అమరేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, వినయ్, కొండాల్‌రెడ్డి, నాగరాజు, రాజేష్, దేవేం ద్ర, వీరయ్య, భాస్కర్, మహేష్, ప్రవీణ్‌రెడ్డి, చైతన్యరెడ్డి, పవన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

జ్యోతిష్మతి విద్యార్థినికి మూడు బంగారు పతకాలు

తిమ్మాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థిని అన్నం హర్షిత జెఎన్‌టియూహెచ్ యూనివర్సిటీ స్థాయిలో మూడు బంగారు పతకాలు సాధించినట్లు జ్యోతిష్మతి విద్యా సంస్థల ఛైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. జ్యోతిష్మతి విద్యా సంస్థల ప్రాంగణంలో గురువారం విద్యార్థిని హర్షితకు ఘనంగా అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జువ్వాడి సాగర్‌రావు మాట్లాడుతూ విద్యార్థిని హర్షిత 2021-25 బ్యాచ్‌లో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో చేరి అకాడమిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన ద్వారా మూడు గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థినిగా రికార్డు సొంతం చేసుకుందన్నారు. జెఎన్‌టీయూ పరిధిలో బీటెక్ (సిఎస్ఈ) విభాగంలో ఉత్తమ విద్యార్థినిగా, మ్యాథమె టిక్స్‌లో అత్యధిక మార్కులు, సీఎస్ఈ విభాగంలో 8.91 సిజిపిఏతో ప్రథమ ర్యాంకు సాధించినందుకు మొత్తం మూడు గోల్డ్‌మెడల్స్ సాధించినట్లు సాగర్‌రావు తెలిపారు. డిసెంబర్‌లో జేఎన్‌టీయూ 14వ స్నాతకోత్సవం సందర్భంగా విద్యార్థిని హర్షిత మూడు గోల్డ్ మెడల్స్‌ను అందుకోనున్నట్లు తెలిపారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో యూనివర్సిటీ స్థాయిలో తమ విద్యార్థులు ఇప్పటి వరకు మొత్తంగా 11 బంగారు పథకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా హర్షితకు లక్ష రూపాయల నగదు పారితోషికాన్ని జువ్వాడి సాగర్‌రావు అందించి అభినందించారు. విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్‌సాయి, కళాశాల ప్రిన్సిపాల్ టి.అనిల్ కుమార్, డీన్ పికే.వైశాలి విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు బహుమతి అందిస్తున్న జువ్వాడి సాగర్‌రావు

16న ఎస్ఆర్ కళాశాల ప్రతిభా పరీక్ష

కరీంనగర్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించాలనే సంకల్పంతో ఎస్ఆర్ సాట్-2025 ప్రతిభా పరీక్షను ఈ నెల 16న నిర్వహించనున్నట్లు ఎస్ఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ వరదారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లుగానే ఈయేడాది ప్రతిభా పరీక్షను 16న ఆదివారం ఉదయం 10.30 గంటలకు జ్యోతినగర్ మహావీర్ హస్పిటల్ సమీపంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో బాలికలకు, ముకరంపురలోని ఎస్ఆర్ కళాశాలలో బాలురకు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ప్రతిభా పరీక్షలో పదవ తర గతి స్థాయిలో గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రంలో నుంచి మొత్తం 75ప్రశ్నలు ఉంటాయని అన్నారు. పదోతరగతి చదువుతున్న ఔత్సాహిక విద్యార్థులు పరీక్ష రాసేందుకు సమీపంలోని ఎస్ఆర్ కళాశాలలో పేరు నమోదు చేసుకోవాలని, లేదా ఫోన్9642117366.91548-54706 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఆర్ కళాశాల బాధ్యులు

సైనిక్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ

చొప్పదండి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని రుక్మాపూర్ సైనిక్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెంలో అభిలాష్ గోల్డ్ మెడల్ సాధించగా 800 మీటర్ల పరుగులో హరీష్ సిల్వర్ మెడల్, లాంగజంప్‌లో అభిషేక్ గోల్డ్ మెడల్ సాధించారు. హైదరాబాద్‌లో జరిగే 69వ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు అర్హత సాధించారు. పాఠశాల డైరెక్టర్ కర్నల్ రాజా దత్త, ప్రిన్సిపాల్ లింగయ్య అభినందించారు.

జమాతే ఉలేమా కార్యాలయం ప్రారంభం

హుజూరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో జమాతే ఉలేమా కార్యాలయాన్ని గురువారం బెంగుళూర్‌కు చెందిన ప్రముఖ ముఫ్తీ పీఎం ముజామిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా దేశంలో ఎక్కడైనా వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు కులాలు మతాలు చూడకుండా వారికి తోచిన ఆర్థిక సాయం చేస్తుంటారన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ జామే మస్జిద్ ఈద్గా కబ్రిస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ముజా హిద్ హుస్సేన్, జిల్లా జమాతే ఉలేమా ఉపాధ్యక్షుడు మహ్మద్ గయాసుద్దీన్, హుజూరాబాద్ అధ్యక్షుడు మహ్మద్ నజీరుద్దీన్, మహ్మద్ షాకీర్ ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనది

కరీంనగర్ అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనదని, నిర్ణయాత్మకమైనదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అల్ఫోర్స్ ఛైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని 45వ డివిజన్‌లో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజితరెడ్డి, ఎస్‌టీ సెల్ ప్రెసిడెంట్ శ్రావణ్ నాయక్, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ వాసు, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ అభిలాష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు, తాళ్లపల్లి శ్రీకాంత్, రాహుల్, వైస్ ప్రెసి డెంట్ మహమ్మద్ జాఫర్, ఆశిష్ గౌడ్, ప్రవీణ్ అంజన్ స్వామి, అజీత్ పండిత్, మహమ్మద్ ఎంజాయ్, తదితరులు పాల్గొన్నారు.



ఓటరు నమోదు కేంద్రం ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

గన్నేరువరం డబుల్ రోడ్డు కోసం మహాధర్నా

గన్నేరువరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండ లానికి డబుల్ రోడ్డు మంజూరై రెండున్నర ఏళ్లు దాటినా పూర్తికావడం లేదని నిరసిస్తూ ఈ నెల 16న గుండ్లపల్లి హైవేపై మహాధర్నా నిర్వహించనున్నట్లు యువజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. డబుల్ రోడ్డు మంజూరు అయ్యాక ప్రభుత్వాలు, పాలకులు మారినా రోడ్డు పనులు మాత్రం ముందుకు సాగడం లేదని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే నుంచి స్పందన లేకపోవడంతో ఆదివారం మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు కాలువ నాగరాజు, తాడూరి వంశీధర్‌రెడ్డి, సందవేని ప్రశాంత్, సమ్మెట అనిల్, కుర్ర హరీష్, పాలపు అజయ్, తేల్ల అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యువజన సంఘాల నాయకులు

యాసంగి పంటలపై సదస్సు

చొప్పదండి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో యాసంగి పంటల ప్రణాళికపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి రామప్రసాద్, శాస్త్రవేత్తలు రజనీకాంత్, జి ఉషారాణి, మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ ఉన్నారు.

పుస్తె మట్టెల పంపిణీ

సైదాపూర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామంలో కరీంనగర్ డెయిరీకి పాలు పోస్తున్న పాల ఉత్పత్తి దారుడు గుంటి సుమలత-సంపత్‌ల కూతురు చందన వివాహం గురువారం జరుగగా కరీంనగర్ డెయిరీ తరుపున డెయిరీ సిబ్బంది పుస్తె మట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ యోహాన్ రెడ్డి, గ్రామ పాల సంస్థ అధ్యక్షుడు కుతాటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

చొప్పదండి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన కరే భగీరథ అనే మహిళ అనారోగ్యంతో మరణించగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా కాట్నపల్లి, చొప్పదండిలో మర ణించినవారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పోలీసుల తీరుకు నిరసనగా న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ కోర్టులో బుధవారం విధి నిర్వహణలో వున్న న్యాయవాది పి అనిల్ కుమార్‌పైన అక్కడి సీఐ కృష్ణ, ఎస్ఐలు సంజీవ్, అశోక్ వారి సిబ్బంది దౌర్జన్యానికి పాల్పడ్డారని నిరసిస్తూ గురువారం కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు లింగంపల్లి నాగరాజు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కందుల అరుణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. న్యాయవాది అనిల్‌కుమార్‌పై దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ లీగల్ సెల్ ఛైర్మన్ కల్లేపల్లి లక్ష్మయ్య పేర్కొన్నారు.

కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసుల తనిఖీలు

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్ ప్రజల రక్షణ, శాంతిభద్రతలు, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశామని పోలీసు కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు. దీనిలో భాగంగా, నగరంలోని రద్దీ ప్రాంతాలలో విస్తృతస్థాయిలో, పోలీసు జాగిలాలతో తనిఖీలు, ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడైనా అనుమా నాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 100, పోలీసు కంట్రోల్ రూమ్ మొబైల్ నంబర్ 8712670744కు తెలియజేయాలని కోరారు. తనిఖీలలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కరీంనగర్ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు